సాక్షి శ్రీకాకుళం

బుధవారం ׀ 10 ׀ సెప్టెంబర్ ׀ 2025



బాల్యానికి చిక్కుముడి

బాల్య వివాహాలు ఆగడం లేదు. అక్కడక్కడా కనిపిస్తూనే ఉన్నాయి.

- 8లో



అత్యాశతోనే అంతం చేశారు

బంగారం వ్యాపారి హత్య కేసు నిందితులు దొరికారు. పోలీసులు వివరాలు వెల్లడించారు.

- 8లో

'డయల్ యువర్ కలెక్టర్'కు 30 ఫోన్ కాల్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సోమవారం జరిగిన 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమానికి 30 ఫోన్ కాల్స్ రాగా వాటిని సంబంధిత మండల వ్యవసాయ అధికారులకు పంపి పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం ఫోన్ కాల్స్ చేసిన రైతులకు కలెక్టర్ మంగళవారం తిరిగి కాల్ చేసి మాట్లాడారు. ఎరువులు వచ్చాయా లేదా, వ్యవసాయ అధికారులు స్పందించారా లేదా అని ఆరా తీశారు.

పలాస-కాశీబుగ్గలో సీదిరి ఇంటి వద్ద రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆందోళన



నరసన్నపేటలో ఉద్రిక్తత



● రైతన్నకు బాసట

ఎరువు కోసం పోరుబాట

అడుగడుగునా ఆంక్షలు.. అడుగు బయట పెట్టనీయకుండా నిర్బంధాలు.. నలుచెరగులా పోలీసు బలగాలు.. అయినా అన్నదాతల నినాదం దిక్కులు పిక్కటిల్లేలా అందరికీ వినిపించింది. వారి ఆందోళన పాలకుల పీఠాలు కదిలే స్థాయిలో జరిగింది. రైతన్నకు జత కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు ఎరువుల కొరతపై ప్రభుత్వాన్ని దునుమాడారు. నిర్లక్ష్యపు పాలనను అధికారులకు వినతి పత్రాలు అందజేసి మరీ వివరించారు.

రైతు కోసం.. మేము సైతం

- అన్నదాతలతో కలిసి గర్జించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- గృహ నిర్బంధాలు, అరెస్టులు లెక్కచేయకుండా నిరసన
- ఎరువుల సమస్య తీరే వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

వైఎస్సార్‌సీపీ మంగళవారం చేపట్టిన అన్నదాత పోరుబాటకు సర్కారు అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. పోలీసు సాయంతో ఆందోళన అణచివేయాలని అనుకుంది. కానీ రైతుల కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. అన్నదాతలు కలిసి రావడంతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. అడ్డుకున్న పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపైనే బైఠాయించారు.

ముందు అనుమతి ఇచ్చి..

సోమవారం రాత్రి 9 గంటల వరకు వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు బాటకు అనుమతులు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అయితే ప్రతిపక్ష పార్టీ ఇచ్చిన పిలుపునకు పెద్ద ఎత్తున స్పందన వస్తుందని ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారంతో ప్రభుత్వం కుట్రలు పన్నడం ప్రారంభించింది. అనుమతులు తూచ్ అంటూ రద్దు చేసేసింది. కేవలం 15 మందితో మాత్రమే వినతి పత్రం ఇచ్చుకోవాలని, ర్యాలీలు, నిరసనలు నిషేధమని ఆంక్షలు విధించింది. తెల్లారే సరికి ఆటంకాలు సృష్టించింది. నాయకులు ఇళ్ల నుంచి బయటకు రాకుండా పోలీసుల బలగాలతో మోహరించింది. కానీ నిర్బంధాలను ఛేదించుకుని వైఎస్సార్‌సీపీ నేతలు పోరుబాటను విజయవంతంగా నిర్వహించారు.

కాశీబుగ్గలో ఉద్రిక్తత

కాశీబుగ్గలో తెల్లవారుజామున నుంచి ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. పోలీసుల నిర్బంధాలు దాటుకుని రకరకాల మార్గాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్నదాతలు కాశీబుగ్గ తరలివచ్చారు. కానీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును గృహ నిర్బంధం చేశారు. దీంతో వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు కొందరిని బలవంతంగా వాహనం ఎక్కించి ఆర్డీఓ ఆఫీస్‌కు తరలించారు. ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నాక సీదిరి అప్పలరాజుతో పాటు పార్టీ పార్లమెంట్ పరిశీలకులు కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంట్) దుంపల రామారావు, రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంట్) శ్యామ్ ప్రసాద్ రెడ్డి తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, తదుపరి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు కవిటి మండలంలో వారి ఇళ్ల వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు వారి అనుచరులను పోలీసులు అడ్డుకున్నారు.

టెక్కలిలో నిర్బంధాలు..

టెక్కలి వైఎస్సార్ జంక్షన్ సమీపంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్‌ను పోలీసులు నిర్బంధించారు. బలవంతంగా అదుపులోకి తీసుకుని ఆర్డీవో కార్యాలయం వద్దకు వాహనంలో తరలించారు. దీంతో వైఎస్సార్ జంక్షన్‌లో కార్యకర్తలు నినాదాలు చేయగా వారిని అరెస్టు చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద పార్టీ పార్లమెంట్ పరిశీలకులు కుంభా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సమన్వయకర్త పేరాడ తిలక్ తదితరులు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు పాతపట్నంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని, మిగతా నాయకులను గృహ నిర్బంధం చేశారు.

నరసన్నపేటలో ఆంక్షలు

నరసన్నపేటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ ఆరంగి మురళీలతో పాటు పలువురిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆ తర్వాత కృష్ణదాస్‌కు, కుంభా రవిబాబుకు అనుమతి ఇచ్చారు. 11 గంటలకు జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య పార్టీ కార్యాలయానికి రావడంతో నాయకులు, కార్యకర్తలు, రైతులు ఒక్క సారిగా చేరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద పూల మాల వేసి ధర్నా నిర్వహించారు. అక్కడే కృష్ణ చైతన్యతో రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) కరిమి రాజేశ్వరరావుతో పాటు పలువురు నాయకుల్ని అరెస్టు చేశారు. తర్వాత విడుదలైన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎచ్చెర్లలో..

రణస్థలం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, రైతులను పోలీసులు అడ్డగించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులను సైతం ఎక్కడికక్కడ నిర్బంధించారు. చివరికి కొద్దిమందితో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలసలో పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను తొలుత ఆయన ఇంటి వద్ద నిర్బంధించారు. పార్టీ కార్యాలయం వద్ద కూడా పోలీసులు నిర్బంధించారు. అనంతరం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి అందజేశారు.

తమ్మినేని ఇంటి వద్ద ఉద్రిక్తత

టెక్కలిలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన మాజీ స్పీకర్, పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను ఆయన ఇంటి వద్ద పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.

శ్రీకాకుళంలో అడ్డంకులు

శ్రీకాకుళంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు మోహరించారు. వారిని తప్పించుకుని ఆర్డీవో ఆఫీస్‌కు వచ్చి రాష్ట్ర వెలమ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ జోన్ ప్రెసిడెంట్ గొండు రఘురాం, ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ మొకళ్ల తాతబాబు, ఎచ్చెర్ల శ్రీధర్ బాబు వినతి పత్రం అందజేశారు.



పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబు, సీదిరి అప్పలరాజు, పిరియా విజయ, నర్తు రామారావు, దుంపల రామారావు



ఆమదాలవలస: ర్యాలీగా వస్తున్న చింతాడ రవికుమార్



హిరమండలం: ఆందోళనకు బయల్దేరుతున్న రెడ్డిశాంతి తదితరులు



రణస్థలం: మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌ను నిలువరిస్తున్న పోలీసులు



నరసన్నపేటలో రైతు నిరసన



టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తికి వినతి పత్రం ఇస్తున్న ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబు, పేరాడ తిలక్, రెడ్డి శాంతి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి తదితరులు

నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

ప్రజా ఉద్యమాలను గృహ నిర్బంధాలతో ఆపలేరు. పాలన చేయలేని ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత లేదు. రైతులు గంటల తరబడి యూరియా కోసం వేచి ఉండడం దారుణం. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇంత దుర్భర పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం.

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

ఎప్పుడూ నిర్లక్ష్యమే..

నాల్గో సారి సీఎంగా గద్దెనెక్కిన చంద్రబాబుకు వ్యవసాయం అన్నా, రైతులన్నా ఎప్పుడూ నిర్లక్ష్యమే. ఒక రోజు వ్యవసాయం దండగ అంటారు. మరో రోజు యూరియా అవసరం లేదంటారు. ఇంకోరోజు కొద్దిగా యూరియా సరిపోతుందంటారు. 15 రోజుల్లో వేయాల్సిన ఎరువు ఇప్పటికీ ఇవ్వకపోతే పంట ఏమైపోతుందోనన్న ఆలోచన ప్రభుత్వానికి ఉండాలి. యూరియా కేవలం టీడీపీ వాళ్లకే దొరుకుతోంది. మిగిలిన వారు కూడా రైతులే అన్న సంగతి గుర్తించాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రైతుల కన్నీరు గుర్తించాలి

ప్రభుత్వం రైతుల కన్నీరు చూడాలి. యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. పల్లెల్లో ఎరువు పసుపు కండువా వేసుకున్న వారికే అందుతోంది. సీఎం ఫొటో మాత్రమే చంద్రబాబుది.. అధికారాలు మాత్రం లోకేష్‌వి. వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నారో లేరో తెలీని పరిస్థితి. ఆ శాఖకు పూర్తిగా తాళాలు వేసేశారు.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

చంద్రబాబువి చేతకాని మాటలు

జిల్లాకు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా కాగా 37 శాతం కూడా పంపిణీ చేయలేదు. రైతులను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. చంద్రబాబు వ్యవసాయం దండగ అని వ్యాఖ్యానించడం అందరికీ తెలిసిందే. రైతులకు ఎరువులు ఇవ్వలేక చెబుతున్న చేతకాని మాటలివి.

– కుంభా రవిబాబు, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు

ఆంక్షల సంకెళ్లు



ఆమదాలవలస: తన ఇంటి ముందు బైఠాయించిన మాజీ స్పీకర్ తమ్మినేని



శ్రీకాకుళం రూరల్: మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రామ్‌మనోహర్ నాయుడులను గృహ నిర్బంధం చేసిన దృశ్యం



టెక్కలి: పేరాడ తిలక్‌ను బలవంతంగా అడ్డుకుంటున్న పోలీసులు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: ఎంవీ స్వరూప్ హౌస్ అరెస్టు



నరసన్నపేట: పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యను అడ్డుకుంటున్న పోలీసులు

అన్నదాత ఆవేదన

అసలు ఎరువు దొరకలేదు



నాకు ఎకరా భూమి ఉంది. ఎంత కష్టపడినా ఎరువులు లేకపోతే పంట చేతికి దక్కదు. అందుకోసం పడరాని పాట్లు పడ్డాను. అయినా గానీ ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేదు. మా లాంటి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతు ఇబ్బందులు పట్టించుకోని నాయకులు ఉంటే ఏమిటి లేకపోతే ఏమిటి.

– దుంపల కామేశ్వరరావు, కుంటికోట, మందస

రైతు కష్టాలు చూడండి



రైతులు యూరియా లేక పడుతున్న ఇబ్బందులు చూడండి. ఏసీ రూమ్‌లలో ఉండి యూరి యా కొరత లేదు అని చెప్పే బదులు గ్రామాల్లో తిరగండి నిజాలు తెలుస్తాయి. ఈ ప్రభుత్వం వచ్చాక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– పల్లి సింహాచలం, రైతు, కాకరాపల్లి, సంతబొమ్మాళి

అరెస్టు చేస్తున్నారు..



రైతుల కోసం వైఎస్సార్ సీపీ నాయకులు పోరాడుతుంటే వారిని అరెస్టు చేసి రైతుల గొంతు నొక్కుతున్నారు. గతంలో సక్రమంగా అందిన యూరియా ఈ ప్రభుత్వంలో ఎందుకు అందడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెప్పాలి. – సింగూరు వాసుదేవరావు, రైతు, పొడుగుపాడు, కోటబొమ్మాళి

చేతకాని ప్రభుత్వం



రైతులకు సకాలంలో ఎరువులను అందించలేని చేతకాని ప్రభుత్వం ఇది. అధికారులకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తున్నా అడ్డుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

– దవళ సూరిబాబు, రైతు, కవిటిఅగ్రహారం, నందిగాం

ఇబ్బందిగా ఉంది



నాకు 4 ఎకరాలు ఉంది. ఒక బస్తా ఇచ్చారు. మరి లేదన్నారు. నేను పొలం మీద పెట్టిన శ్రమ పెట్టుబడి వృథా అవుతుంది. సకాలంలో ఎరువులు ప్రభుత్వం ఇవ్వక పోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. – లండ కోదండ రావు, రైతు, సందూరు, మందస

పోరాటం వల్ల వచ్చాయి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రజా సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే కొద్దిగానైనా ఎరువులు వచ్చాయి. లేదంటే ఈ ప్రభుత్వానికి రైతులు బాధలు పట్టవు. అందుకే ప్రజలు మేల్కొన్నారు. – బమ్మిడి సంతోష్ కుమార్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, పలాస-కాశీబుగ్గ

నదిలో దూకిన బాలుడు



నదిలో తాడు వేసి బాలుడిని బయటకు తీస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ కొత్త వంతెన పై నుంచి ఓ బాలుడు నాగావళి నదిలో దూకేసిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి శ్రీనుబాబు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని రెల్లివీధికి చెందిన బి.రమేష్ అంబేడ్కర్ జంక్షన్ వద్ద పళ్ల రసం దుకాణం నడుపుతున్నారు. ఆయన పెద్ద కుమారుడు ఓ స్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ మాదిరిగానే యూనిఫాం ధరించి స్కూల్‌కు వెళ్లిన విద్యార్థి సరిగ్గా ఉదయం 9:15 గంటలకు డేఅండ్‌నైట్ సమీప కొత్త వంతెన పైనుంచి దూకేశాడు. దీన్ని గమనించిన ఏఆర్ కానిస్టేబుల్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. విద్యార్థి తేలియాడుతూ కనిపించడంతో అటువైపుగా వెళ్తున్న పాల వ్యాపారి తన వద్దనున్న తాడు వేయడం, అప్పటికీ సరిపోకపోవడంతో ఓ జాలరి తన వద్ద నున్న తాడు కలిపి వేయడంతో బాలుడు అందుకున్నాడు. అప్పటికే చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సైతం జాలరితో పాటు నదిలోకి దిగి బాలున్ని రక్షించి బయటకు క్షేమంగా తీశారు. ఈలోగా తల్లిదండ్రులు రావడంతో కౌన్సిలింగ్ చేశామని, చిన్న కారణానికే క్షణికావేశంలోనే బాలుడు నదిలో దూకాడని ఏడీఎఫ్ఓ శ్రీనుబాబు పేర్కొనడం విశేషం. అదే మార్గంలో బాలున్ని చూసేందుకు వాహనదారులు అధికంగా ఆగడంతో కాసేపు ట్రాఫిక్ అయ్యింది.

'యూరియా వాడకం తగ్గించండి'

గార: యూరియా వాడకాన్ని శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే వినియోగించాలని, అధికంగా వాడవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం సాయంత్రం తూలుగు సచివాలయం వద్ద రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియాను మూడు దఫాలుగా 25 కిలోల లెక్కన వినియోగించాలని, రైతులందరికీ ఎరువు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు రైతులు ఇప్పటివరకు ఒక బస్తా కూడా దొరకలేదని తెలపగా, తూలుగుకు యూరియా ఇండెంట్ పెట్టడం జరిగిందని, రెండు రోజుల్లో వస్తుందని తెలిపారు.

● ఎరువుల టోకెన్ల కోసం నిరీక్షణ



బూర్జ రైతు సేవా కేంద్రం ఆవరణలో ఎరువుల టోకెన్ల కోసం క్యూలో నిరీక్షిస్తున్న రైతులు

బూర్జ: బూర్జ రైతు సేవా కేంద్రం ఆవరణలో ఎరువుల టోకెన్ల కోసం రైతులు గంటల కొద్దీ నిరీక్షించారు. మంగళవారం సాయంత్రం రైతులకు టోకెన్లు అందజేసి బుధవారం ఎరువులు అందిస్తారనే సమాచారంతో రైతులు క్యూలో నించుని టోకెన్లు అందుకున్నారు. 250 మందికి టోకెన్లు అందజేశారు.

మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేసి వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి, చెల్లించాల్సిన 4 డీఏలను వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలలో కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే చెల్లించిందని, కనీసం ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము అవసరం మేరకు మంజూరు చేయడం లేదన్నారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలుశిక్ష

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం వద్ద 2022లో గంజాయి అమ్ముతూ పట్టుబడిన గణశ్యామ్ బెహరా, రెయ్యి త్రినాథ్, పైల వాసులకు పదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పి.భాస్కర రావు తీర్పు వెల్లడించారని సీఐ మీసాల చిన్నంనాయుడు మంగళవారం తెలిపారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని సీఐ పేర్కొన్నారు.

ప్రతి రోజూ డయల్ యువర్ కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ ఉంటుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం వెల్లడించారు. ఎరువుల సంబంధిత విషయాలపై డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. 08942 222565, 08942 222648 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో అట్టడుగు వర్గాలకు సత్వర న్యాయం అందించాలంటే ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల మధ్య సమన్వయం అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి మంగళవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో సదస్సు నిర్వహించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, అక్రమ రవాణా బాధితులు, ట్రాన్స్‌జెండర్లు, గిరిజనులు, అసంఘటిత కార్మికులు వంటి వివిధ వర్గాల ప్రయోజనాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విభాగాల అధికారులు తాము అందిస్తున్న పథకాలను వివరించగా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమాజానికి తాము చేస్తున్న సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో డీసీపీవో రమణ, ఎల్ఏడీసీ ప్రధాన అధికారి కె.ఆఫీసు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల : ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలకు అర్హత సాధించిన బైపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు బీ-ఫార్మసీ, ఫార్మాడీ, బీ టెక్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్/ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సాంకేతిక విద్యాశాఖ ఉన్నత విద్యామండలి వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసిందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త కె.నారాణరావు మంగళవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రోసెసింగ్ కోసం ఈ నెల 11 నుంచి 16 వరకూ రుసుము చెల్లించాలని చెప్పారు. ఈ నెల 12 నుంచి 17లోగా ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ పరిశీలన, 13 నుంచి 18 వరకూ కళాశాలల కోర్సుల ఎంపికకు వెబ్ ఆప్షన్లు, 19న వెబ్ ఆప్షన్ల మార్పు, 21న కళాశాలలు, కోర్సుల కేటాయింపు జాబితా వెల్లడించనున్నట్లు వివరించారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 23లోగా కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలన్నారు.

నిరసన ర్యాలీ విజయవంతం చేయండి

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయవాడ ధర్నాచౌక్ వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరగనున్న శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల నాయకుడు జామి శ్రీకాంత్‌బాబు మంగళవారం పిలుపునిచ్చారు. లైబ్రరీ సైన్స్ నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కొన్ని సంవత్సరాలుగా లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఈ కోర్సు పూర్తిచేసిన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామక వయస్సు కూడా దాటిపోయి మానసిక సంఘర్షణ, ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్

పాతపట్నం: ఇంటర్మీడియట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు షెడ్యూల్ ఉంటుందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి దుర్గారావు, ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు, అధ్యాపకులు ఉన్నారు.

బాల్యానికి.. చిక్కుముడి!

- జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
- రాష్ట్రంలో మూడో స్థానం
- చదువుకు దూరమవుతున్న బాలికలు
- జీవితాంతం వెంటాడుతున్న రుగ్మతలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్ఎన్‌పేట మండలంలోని ఓ గ్రామంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాలని నిశ్చయించారు. సన్నాహాలు కూడా ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి చేరుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్న వయసులో వివాహం జరిపితే కలిగే అనర్థాలను వివరించారు. దీంతో తల్లిదండ్రులు వివాహాన్ని వాయిదా వేసుకున్నారు.

హిరమండలానికి ఓ కుటుంబం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి చదువుతున్న కుమార్తెకు వివాహం జరపాలని నిర్ణయించారు. బాలికకు పెళ్లి ఇష్టం లేదు. దీంతో స్నేహితుల ద్వారా చైల్డ్‌లైన్ అధికారులను ఆశ్రయించింది. వారు వచ్చి కౌన్సెలింగ్ ఇవ్వడంతో తల్లిదండ్రులు వివాహాన్ని వాయిదా వేసుకున్నారు.

హిరమండలం: బడిబాట పట్టాల్సిన బాలికలు పెళ్లిపీటలెక్కుతున్నారు. తెలిసీ తెలియని వయసులో వారిని మూడుముళ్ల బంధంలో చిక్కుకుంటున్నారు. చదువు, ఆటపాటలతో హాయిగా గడవాల్సిన సమయంలో గర్భం దాల్చుతున్నారు. అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఆర్థిక ఇబ్బందులు, కట్టుబాట్లతో పెద్దలే చిన్నారులకు పెళ్లిచేసి అత్తారింటికి పంపుతున్నారు. జిల్లాలో ప్రధానంగా వలసలు వెళ్లే పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. జిల్లాలో 11 తీర ప్రాంతాల్లో సైతం బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపుగా గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు అనేవి ఒక సంప్రదాయంగా వస్తున్నాయి. అక్కడ కులం కట్టుబాట్లతో ఎక్కవగా చిన్ననాటే పెళ్లిళ్ల జరిపిస్తున్నట్టు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో చాలావరకూ బాల్య వివాహాలు అదుపులోకి వచ్చాయి. అవగాహన ఉన్నవారు తమ పిల్లల విషయంలో చాలా రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ, నిరక్షరాస్యులు మాత్రం ఆడపిల్లలను భారంగా పరిగణించి బాల్య వివాహాలు చేసేస్తున్నారు. సమాచారం అందుకుంటున్న అధికారులు 2020-21లో 114, 2021-22లో 68, 2022-23లో 144, 2023-24లో 96, 2024-25లో 28 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 2025-26కు సంబంధించి 18 బాల్య వివాహాలను అడ్డుకుంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఆర్థిక భారంతో..

శ్రీకాకుళం ప్రధానంగా వలసల జిల్లా. చాలా గ్రామాల్లో భార్య, భర్త ఇద్దరూ పనికి వెళితే గానీ పూటగడవని పరిస్థితి. ఈ నేపథ్యంలో పదో తరగతి వరకూ ఆడపిల్లలను చదివించి వెంటనే వివాహాలు జరిపించేస్తున్నారు. ఇలా చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని అనుకుంటున్నారే తప్ప.. బాల్య వివాహాలతో తమ పిల్లలను అనారోగ్య కూపంలోకి తోసివేస్తున్నామన్న విషయాన్ని గుర్తించడం లేదు.

ఆ జాబితాలో జిల్లా..

రాష్ట్రంలో 45 శాతానికి మించి బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల్లో శ్రీకాకుళం మూడోస్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అందులో 23 శాతం మంది 15 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలికలే అమ్మలుగా మారుతున్నారు. బాల్యంలో తల్లులు కావడం అనేది గతంతో పోల్చుకుంటే తగ్గినప్పటికీ.. బాల్య వివాహాలు మాత్రం ఆగకపోడం ఆందోళన కలిగిస్తోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే స్పష్టం చేసింది. 15 నుంచి 19 ఏళ్ల వయసు లోపు బాలికలు నిర్దేశిత బరువు కంటే తక్కువగా ఉంటారు. తల్లిగా మారే సమయంలో బాడీ మాస్ ఇండెక్స్ తగ్గడంతో వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో బిడ్డ గర్భంలో చనిపోవడం, వైకల్యంతో పుట్టడం, ఆరోగ్యకరమైన ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

ఫిర్యాదు చేయవచ్చు..

బాల్య వివాహాలు జరిగితే నిర్భయంగా 1098, 100, 181 వంటి టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం సమాచారం అందించవచ్చు. జిల్లా అధికారులు రంగంలోకి దిగి స్థానిక పోలీసుల సహకారంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహాల నియంత్రణకు 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. దీని ద్వారా కూడా బాల్య వివాహాల సమాచారం చేరవేయవచ్చు. అయితే, ఇటీవల ఫేక్ ఫిర్యాదులు చేస్తుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ప్రేమ వ్యవహారాల కారణంగా కొంతమంది తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. నిజంగా బాల్య వివాహం జరుపుతుంటే మాత్రం నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. అధికారులు వచ్చి తప్పకుండా అడ్డుకుంటారు.

చట్టరీత్యా నేరం..



బాల్య వివాహాలు చట్టపరంగా నేరం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే ఫిర్యాదు చేయాలి. ఎటువంటి భయం అవసరం లేదు. స్థానిక పోలీసుల రక్షణలోనే విచారణ జరుగుతుంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. వారి సమ్మతితోనే వివాహాన్ని నిలుపుదల చేయిస్తాం. బాల్య వివాహాలతో అనారోగ్యం తప్పదు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. దీనిపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం

– ఐ.విమల, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

బంగారం చోరీపై కేసు నమోదు

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలో దుక్క మధుసూదన్ రెడ్డి ఇంట్లో బంగారం చోరీకి గురైంది. ఎస్సై పిన్నింటి రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. మధుసూదన్ రెడ్డి ఇంట్లో కొద్దిరోజుల కిందట నగదు, బంగారం మాయమైంది. అయితే ఇంట్లో పనిచేస్తున్న మహిళపై అనుమానంతో ప్రశ్నించగా ఏమీ తెలియదని సమాధానం ఇచ్చింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీఐ వారోత్సవాలు నిర్వహించాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్టీఐ 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అక్టోబరు 12 నుంచి వారోత్సవాలు నిర్వహించాలని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అనపాన షణ్ముఖరావు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కలెక్టర్ సమన్వయాధికారిగా, జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ అధికారిగా, ఇద్దరు ఆర్టీఐ కార్యకర్తలతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. పౌర సమాచార అధికారులు, ఫస్ట్ అప్పీల్ అథారిటీ, ఎన్‌జీఓలు, ఆర్టీఐ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, న్యాయ విద్యార్థులతో ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించాలని విన్నవించారు.

'ప్రాణభయం ఉంది'

కొత్తూరు: ఇద్దరు వ్యక్తులు తన విధులకు ఆటంకం కలిగిస్తూ, కులం పేరుతో దూషించి దాడి చేయడంతో పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశానని స్థానిక ఏపీఎం లలిత తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జూమ్ మీటింగ్‌లో ఉండగా పాత్రికేయులమని చెబుతూ నివగాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వీడియోలు చిత్రీకరించడంతో పాటు తనను గదిలో బంధించారని ఆమె ఆరోపించారు. అక్కడ ఉన్న సీసీలు కాపాడి బయటకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. వీరిద్దరి నుంచి ప్రాణభయం ఉందని తెలిపారు. అనంతరం వెలుగు సిబ్బందిపై రాజకీయ వేధింపులు అరికట్టాలంటూ మండల మహిళ కార్యాలయం ముందు బైఠాయించారు.

కదం తొక్కిన జీడి కార్మికులు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న జీడి కార్మికులు, సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం మందస జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు, జీడి కార్మిక సంఘ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీడి కార్మికులకు పూర్తి స్థాయి పని దినాలు కల్పించాలని, కాల్చిన పిక్కలు అక్రమ తరలింపు ఆపాలని కోరుతూ శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందస జీడి యాజమాన్యాలు కాల్చిన పిక్కలను పరిశ్రమలో పనిచేసిన కార్మికులకు ఇవ్వకుండా అక్రమంగా వేరే ప్రాంతాలకు తరలిస్తుంటే ప్రభుత్వం యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్మికులకు పని కల్పించకుండా, లైసెన్సులు లేకుండా ఇతర ప్రాంతాలకు అక్రమ పద్ధతిలో తరలించడం సరికాదన్నారు. కార్మికులు అతి తక్కువ వేతనాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని, కనీస వేతనాలు గానీ, పీఎఫ్, ఈఎస్ఐ, అదనపు పనికి అదనపు వేతనం వంటివి అమలు చేయకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల పోరాటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైస్ మిల్లు కార్మిక సంఘం నాయకులు కె.కేశవరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, జిల్లా జీడి కార్మిక సంఘం నాయకులు అల్లు హేమలత, సీహెచ్ చంద్రమ్మ, సీహెచ్ జానకమ్మ, కె.శేషమ్మ, పి.సావిత్రి, జి.బాలమ్మ, కె.కుమారి, కె.శాంతమ్మ, కె.సరస్వతి, బి.భారతి, కె.ధనం, డి.లక్ష్మి, ఎం.దానమ్మ, డి.భారతమ్మ పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ. వెనుక నిందితులతో పోలీసులు

ఆమదాలవలస: కొత్తవలస గ్రామానికి చెందిన అరసవెల్లి హరమ్మ హత్య కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆమదాలవలస పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో హరమ్మ తీవ్రంగా గాయపడిందన్నారు. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 4వ తేదీన మృతిచెందిందన్నారు. ఈ ఘటనలో కొత్తవలస గ్రామానికి చెందిన దవల లక్ష్మణరావుతోపాటు మరో నలుగురు వ్యక్తులు, ఒక మైనర్‌పై హత్య కేసు నమోదు చేశామని తెలిపారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న నిందితులు పోలీసులకు దొరక్కుండా పరారయ్యారన్నారు. తదుపరి దర్యాప్తులో ఎస్సై ఎస్.బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు నిందితుల కదలికలపై సమాచారం సేకరించి మంగళవారం కొర్లకోట సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితులను జూనియర్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మైనర్ నిందితుడిని జువెనైల్ కోర్టు ఎదుట హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

కుల సంఘాలు సమాజసేవ చేయాలి



మాట్లాడుతున్న అంధవరపు సూరిబాబు

నరసన్నపేట: కుల సంఘాలు సమాజ సేవలో ముందుండాలని కళింగ కోమట్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధి, కళింగకోమటి కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. నరసన్నపేటలోని ఓ కన్వెన్షన్ హాలులో జిల్లా కళింగ కోమట్లు సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కళింగ కోమట్లు రాష్ట్ర సంఘం ప్రతినిధి బోయిన గోవిందరాజులు, జిల్లా సంఘం ప్రతినిధి తంగుడు జోగారావు తదితరులు మాట్లాడుతూ కళింగ కోమట్ల అభివృద్ధే ధ్యేయమన్నారు. కాగా, జిల్లా కళింగ కోమట్లు సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక వాయిదా పడింది. ఏకాభిప్రాయానికి రాకపోవడంతో ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు జోగారావు తెలిపారు. కార్యవర్గం ఎన్నికకు గోవిందరాజులు అధ్యక్షతన మరో 8 మందితో కూడిన కమిటీని నియమించామని చెప్పారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఉలాల భారతిదివ్య

ఇచ్ఛాపురం : విశాఖపట్నం సీతమ్మధారలో మూగబాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్-1 ఉలాల భారతి దివ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నేరస్తులను వెంటనే పట్టుకుని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

అత్యాశతోనే అంతం చేశారు



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు. వెనుక నిందితులతో పోలీసులు

- పక్కా పథకం ప్రకారమే బంగారం వ్యాపారి గుప్తా హత్య
- ఇద్దరు నిందితుల అరెస్టు
- ఆర్ఎస్ జ్యూయలరీ యజమానిపై కేసు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



రికవరీ చేసిన బంగారం బిస్కెట్లు

నరసన్నపేట : అత్యాశకు పోయి సులువుగా డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితోనే నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి పొట్నూరు వెంకట పార్వతీశం గుప్తాను మోలి అప్పలరాజు, జువ్వాది సంతోష్‌లు హత్య చేశారని టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు తెలిపారు. గుప్తా వద్ద కాజేసిన కేజీ 33 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామని చెప్పారు. అప్పలరాజులు, జువ్వాది సంతోష్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు. నిందితుల వద్ద బంగారాన్ని కొనుగోలు చేసిన శ్రీకాకుళం నగరానికి చెందిన ఆర్ఎస్ జ్యూయలరీ యజమానిని ఈ కేసులో మరో ముద్దాయిగా గుర్తించామని, ఈయన్ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. కేసు వివరాలను నరసన్నపేటలో మంగళవారం విలేకరులకు వెల్లడించారు.

గెడ్డలో మృతదేహం లభ్యం..

బంగారం వ్యాపారం చేస్తున్న గుప్తా ఆగస్టు 26న తన బొలెరో వాహనంలో డ్రైవర్ సంతోష్‌తో పాటు విశాఖ వెళ్లారు. నాలుగు రోజులైనా ఇంటికి రాకపోవడంతో గుప్తా సోదరుడు మన్మధరావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. వారం తర్వాత గుప్తా మృతదేహం శ్రీకాకుళం సమీపంలోని రామిగెడ్డ ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. శరీరంపై గాయాలు బట్టి హత్య కేసుగా దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ సంతోష్‌పై అనుమానంతో నిఘా పెట్టి విచారణ చేయగా బంగారం కోసమే గుప్తాను హత్య చేసినట్లు అంగీకరించాడు. పెద్దపాడు వద్ద ఆదిత్య కార్ వరల్డ్ బిల్డింగ్ యజమాని మోలి అప్పలరాజు షాపులో గుప్తా మెడకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం రామిగెడ్డలో మృతదేహాన్ని పడేశారు. ఆ సమయంలో వర్షాలు అధికంగా పడటంతో మృతదేహం కొట్టుకుపోతుందని భావించారు. ఇంతలో తుప్పలు అడ్డుపడటంతో మృతదేహాన్ని గుప్తా బంధువులు గుర్తించగలిగారు. డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితోనే అప్పలరాజు ఈ హత్యలో పాలుపంచుకుని బంగారంలో అధిక భాగం తీసుకున్నాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అప్పలరాజేనని డీఎస్పీ తెలిపారు. సంతోష్ భార్య ప్రశాంతి, బొరిగివలసకు చెందిన మణిలు కేసులో నిందితులు కాదని వివరించారు. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి ఎస్ఐలు సీహెచ్ దుర్గాప్రసాద్, అశోక్‌బాబు, అనిల్, రంజిత్‌లు చాకచక్యంగా కేసును దర్యాప్తు చేసి సకాలంలో బంగారాన్ని రికవరీ చేశారని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



తాయిలాల కోసం తోపులాట

తెలుగుదేశం పార్టీ నాయకులు మహిళలకు ఇచ్చే తాయిలాల కోసం తోపులాట జరిగింది. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలిలో గల ఎంహెచ్ స్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించిన స్త్రీ శక్తి కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సభకు వస్తే తాయిలాలు ఇస్తామని చెప్పడంతో మహిళలు తరలివచ్చారు. వారికి జాకెట్ పీస్‌లు ఇస్తుండటంతో సభలో ఉన్నవాళ్లంతా ఒక్కసారి చేరడంతో తోపులాట జరిగింది. ఈ సమయంలో ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రమే మిగిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితప్రయాణం కల్పించామన్నారు. త్వరలోనే ట్రాన్స్‌జెండర్లకు, మహిళలకు ఉచిత ప్రయాణం కోసం స్మార్ట్‌కార్డులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైడిశెట్టి జయంతి, మాదారపు వెంకటేషు తదితరులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం